
షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152
1st Year Happy Work Anniversary.
Good for Health — Best for Readers — THE POWER OF PEN RK

సంపుటి : 2 సంచిక : 161 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 27 ఏప్రిల్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 161 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 27 April 2025 PAGES : 8 PRICE : 3/-

# పాకిస్థాన్‌కు చుక్క నీరు కూడా వెళ్లదు..

**సింధు జలాల ఒప్పందం సస్పెండ్ చేసిన భారత్**
**పాక్‌కు నీటి ప్రవాహం నిలిపివేతపై అమిత్ షా, జలశక్తి మంత్రి భేటీ**
**స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక చర్యలపై సమావేశంలో చర్చ**
**"పాక్‌కు చుక్క నీరు వెళ్లదు" అని మంత్రి సి.ఆర్. పాటిల్ స్పష్టీకరణ**
**పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం, చర్చలకు విముఖతే కారణాలని భారత్ వెల్లడి**



2

## జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

**జీవీఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీధర్‌పై కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం విజయం**
**74 మంది సభ్యుల మద్దతుతో తీర్మానం నెగ్గినట్లు కార్పొరేటర్ల వెల్లడి**
**శ్రీధర్ అవినీతి, అరాచకాలకు పాల్పడ్డారని కూటమి కార్పొరేటర్ల ఆరోపణ!**
**నాలుగేళ్లుగా కనీస వసతులు (వీధి దీపాలు, నీళ్లు) కల్పించలేదని విమర్శ**
**విశాఖను అభివృద్ధి పథంలో నడిపిస్తామని కూటమి సభ్యుల ధీమా**



**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 26)**
విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం విజయవంతమైంది. ఈ పరిణామంతో కూటమి సభ్యులు సంబరాలు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ అవినీతి, అరాచక పాలనకు చరమగీతం మిగతా 2లో

## విద్యార్థిగా పాక్‌కు వెళ్లి.. ఉగ్రవాదిగా తిరిగొచ్చి
## పహల్గాం ఉగ్రవాది ఉదంతమిది..

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 26)**
చదువుకోవాల్సిన వయసులో అతివాద భావజాలానికి ప్రేరేపితుడయ్యాడు. చదువు పేరుతో పొరుగుదేశం వెళ్లి ఉగ్రవాద శిక్షణ తీసుకున్నాడు. తిరిగొచ్చి సొంత గడ్డపైనే అకృత్యాలకు పాల్పడ్డాడు. పహల్గాంలో పర్యాటకులకు మరణ శాసనం రాసిన ఉగ్రవాది ఆదిల్ హుస్సేన్ థోకర్ ఉదంతమిది.

**విద్యార్థిగా వెళ్లి..**20 ఏళ్ల ఆదిల్ థోకర్‌ది అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్‌బెహారాకు సమీపంలోని గురీ అనే చిన్న గ్రామం. టీనేజ్‌లో ఉండగానే పలు నిషేధిత ఉగ్ర సంస్థలకు చెందిన ముష్కరులకు దగ్గరగా మెదిలాడు. 2018లో దక్షిణ కశ్మీర్‌లో జరిగిన ఓ ఉగ్రవాది అంతిమయాత్రలో పాల్గొన్నాడు. అదే ఏడాది పాక్ నుంచి విద్యార్థి వీసా సాధించి వాఘా సరిహద్దు దాటాడు. ఆ తర్వాత బాహ్య ప్రపంచానికి కన్పించకుండా పోయాడు. మిగతా 2లో



## పీఓకేలో వరద భయం.. భారత్ పనేనని పాక్ ఆరోపణ

**పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లో జీలం నది నీటిమట్టం ఆకస్మికంగా పెరుగుదల**
**ముందస్తు సమాచారం లేకుండా భారత్ నీటిని విడుదల చేసిందని పాక్ వర్గాల ఆరోపణ**
**హట్టియాన్ బాలా ప్రాంతంలో వాటర్ ఎమర్జెన్సీ ప్రకటన,**
**నదీ తీర ప్రాంత వాసులకు హెచ్చరికలు**
**సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచనలు... స్థానికుల్లో భయాందోళన** మిగతా 2లో

## ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం.. పెద్దఎత్తున ఆయుధాలు స్వాధీనం

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 26)**
పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడి తర్వాత ముష్కరులను పట్టుకునేందుకు భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతాదళాలు గుర్తించి.. ధ్వంసం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వారి స్థావరాల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఉగ్రస్థావరాలు ఉన్నాయని నిర్దిష్ట నిఘా వర్గాల సమాచారం మేరకు..మిగతా 2లో



## అప్పటిలా కాదు... ఇప్పుడు ప్రతి గ్రామంలో మనం ఉన్నాం

**వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో జగన్ వ్యాఖ్యలు**
**గతంలో తనను 16 నెలలు జైల్లో ఉంచారని వెల్లడి**
**ప్రజలే అండగా నిలిచారని స్పష్టీకరణ**
**ఇప్పుడు కూడా ప్రజలే తీవ్రంగా స్పందిస్తారని ఆశాభావం**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 26)**
తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా, ఇబ్బందులకు గురి చేసినా తాను కానీ, పార్టీ శ్రేణులు కానీ భయపడే ప్రసక్తి లేదని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో తనను అన్యాయంగా 16 నెలల పాటు జైలులో ఉంచారని, పార్టీని నడపలేని పరిస్థితులు కల్పించినా ప్రజలు తనను, పార్టీని ఆదరించారని ఆయన గుర్తు చేసుకున్నారు.పీఏసీ సమావేశంలో జగన్ మాట్లాడుతూ, "నాడు నన్ను 16 నెలలు జైలులో పెట్టారు. పార్టీని నడిపే పరిస్థితి లేకుండా చేశారు. అయినా ప్రజలు ఆశీర్వదించారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో మన పార్టీ ఉంది. వాళ్లు ఎన్ని కేసులు పెడితే ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారు. నన్ను మరోసారి జైలుకు పంపినంత మాత్రాన ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరు" అని అన్నారు. గతంలో అక్రమాస్తుల కేసులో తనను అన్యాయంగా ఇరికించి జైలుకు పంపినా, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అఖండ విజయాన్ని అందించారని జగన్ గుర్తుచేశారు. అదే విధంగా, ఇప్పుడు కూడా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, మిగతా 2లో

## ఏపీ లిక్కర్ స్కామ్ లోకల్ కాదు...

**ఏపీ లిక్కర్ స్కామ్ రూ. 3200 కోట్లు కాదు.. రూ.10 వేల కోట్లకు పైనే అన్న ఎమ్మెల్యే**
**అధికారిక సేల్ తగ్గించి అక్రమంగా అమ్మేసి వేల కోట్లు దోచేశారని ఆరోపణ**
**అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 26)**
వైసీపీ పాలనలో ఇంటర్నేషనల్ స్థాయిలో లిక్కర్ స్కామ్ జరిగిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ అన్నారు. రూ.1.30 లక్షల కోట్ల విలువైన నగదు లావాదేవీలు జరగడం దేశంలో ఎక్కడైనా చూశామా అని ఆయన ప్రశ్నించారు. అక్రమంగా దోచేయడం కోసమే మద్యం వ్యాపారంలో డిజిటల్ పేమెంట్లను జగన్ సర్కార్ అనుమతించలేదని ఆరోపించారు.ఓ వైపు ప్రధానమంత్రి మోదీ డిజిటల్ ఇండియా అంటుంటే జగన్ రెడ్డి మాత్రం క్యాష్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. ప్రస్తుతం ఈ కుంభకోణంపై విచారణ సాగిస్తున్న సిట్ మరింత లోతుగా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ లిక్కర్ స్కామ్ రూ. 3200 కోట్లకు పరిమితం కాలేదని, రూ.10 వేల కోట్లకు పైనే అని అన్నారు. వేల కోట్ల అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగితే ఈడీ, సీబీఐ ఎందుకు రంగంలో దిగడం లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశ్నించారు. రూ.1.30 లక్షల కోట్ల క్యాష్ ట్రాన్సాక్షన్ జరుగుతుంటే గత ఐదేళ్లు ఈడీ, సీబీఐ ఈ కుంభకోణంపై ఎందుకు దృష్టి సారించలేదన్నారు. 1989లో రూ.60 కోట్ల విలువైన బోఫోర్స్ కుంభకోణం రాజీవ్ గాంధీ కొంపముంచిందని, 2014లో 2జీ స్కాం మన్మోహన్ సింగ్‌ను దెబ్బకొట్టిందని గుర్తు చేశారు. ఈ రెండు స్కాములు కాంగ్రెస్ పార్టీకి జాతీయ హోదా కోల్పోయే పరిస్థితి తెచ్చాయన్నారు. ఏపీలో జరిగిన లిక్కర్ స్కామ్ ఆషామాషీ కేసు కాదని తెలిపారు. కరోనా సమయంలో 2020 మార్చి 23న లాక్ డౌన్ విధించారు... మే 4న మద్యం దుకాణాలను రీ ఓపెనింగ్ చేశారు... ఆ 42 రోజులు మాత్రమే మద్యం విక్రయాలు ఆగాయని, కానీ లక్షల క్రేట్ల మద్యం విక్రయాలు తగ్గిపోయినట్లు లెక్క చూపించారని ఎమ్మెల్యే మండిపడ్డారు. జగన్ రెడ్డి పర్యవేక్షణలో నడిచిన కసిరెడ్డి అండ్ టీం ఎక్సైజ్ డిపార్టుమెంటులోని మద్యం డిపోలకు వెళ్లకుండా, స్కానింగ్ కాకుండా డిస్టిలరీల నుంచి నేరుగా దుకాణాలకు స్టాక్ తరలించి అక్రమంగా అమ్మేసుకున్నారని ఆరోపించారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుటుంబానికి చెందిన మెక్ డోవెల్ డిస్టిలరీ మూసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అడిగినంత కమీషన్లు ఇవ్వలేదని నేషనల్, ఇంటర్నేషనల్ బ్రాండ్ల డిస్టిలరీలను అడ్డంగా మూసేశారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి 3 బాటిల్స్ తీసుకునే వెసులుబాటును కూడా తొక్కేశారని, తామిచ్చిన మద్యమే తాగాలని నియంతలా వ్యవహరించారని... జగన్ రెడ్డి అండ్ బ్యాచ్ కు డబ్బుపై ఉన్న వ్యామోహంతోనే ఇది జరిగిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. ఐఎస్ఐ గుర్తింపు పొందిన చెన్నైలోని ప్రముఖ ఎస్.జీ.ఎస్ లేబరేటరీ జగన్ ప్రభుత్వం విక్రయించిన సొంత మద్యం బ్రాండ్లపై సంచలన విషయాలను బయటపెట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వైసీపీ ప్రత్యేకంగా ప్రోత్సహించిన ఆంధ్రా గోల్డ్, 9సీ హార్సెస్, సిల్వర్ స్ట్రైప్ విస్కీలలో ప్రమాదకరమైన పైరోగలాల్, ఐసోఫులరిక్ యాసిడ్, డైఇథనాల్ టాలెట్ ఉన్నాయని తేల్చిందన్నారు. ఇవి తాగితే శరీరంలోని మిగతా 2లో

## ఏపీ లిక్కర్ స్కాం కేసు

**సజ్జల శ్రీధర్ రెడ్డికి రిమాండ్**
**ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో సిట్ దూకుడు**
**నిన్న ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్ రెడ్డి అరెస్ట్**
**నేడు విజయవాడలో ఏసీబీ కోర్టులో హాజరు**
**మే 6 వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధించిన న్యాయమూర్తి**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 26)**
ఏపీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు మే 6వ తేదీ వరకు రిమాండ్ విధించింది. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అతడిని విజయవాడ జిల్లా జైలుకు తరలించనున్నారు. ఈ కేసులో ఆరో నిందితుడిగా (ఏ6) ఉన్న శ్రీధర్‌రెడ్డిని సిట్ అధికారులు నిన్న హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. మిగతా 2లో

## హైదరాబాద్‌లో అత్యంత ఎత్తైన భవంతి.. ఏకంగా 57 అంతస్తులు

**సాస్ క్రౌన్ పేరిట కోకాపేట్‌లో ఆకాశహర్మ్యం**
**4.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం**
**ఒక అంతస్తుకు ఒక ఫ్లాట్, స్కై విల్లాస్ వంటి ప్రత్యేకతలు**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 26)**
హైదరాబాద్‌లో ఏకంగా 57 అంతస్తులతో అత్యంత ఎత్తైన భవంతి నిర్మాణం జరుపుకుంటోంది. సాస్ క్రౌన్ పేరిట కోకాపేట్‌లో ఈ ఆకాశహర్మ్యం నిర్మితమవుతోంది. 4.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనానికి ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇందులో ఒక అంతస్తుకు ఒక ఫ్లాట్, స్కై విల్లాస్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. భాగ్యనగరంలో ఇప్పటివరకు నిర్మించిన అత్యంత ఎత్తైన భవనం కూడా ఇదే. ఇదే మాదిరి మరిన్ని ఆకాశహర్మ్యాలు నగరంలో వేర్వేరు ప్రాంతాలలో నిర్మాణ దశలో ఉన్నాయి. 62 అంతస్తుల వరకు మరో భవనం అనుమతుల దశలో ఉంది. వీటన్నింటితో ఆకాశ హర్మ్యాల్లో దేశ ఆర్థిక రాజధాని తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది.

మొదటి పేజీ తరువాయి

# జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

పాడామని వారు వ్యాఖ్యానించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన అనంతరం కూటమి కార్పొరేటర్లు మీడియాతో మాట్లాడారు. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో విశాఖ నగరంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. కనీసం వీధి దీపాలు వెలిగించలేని, తాగునీటి సమస్యలు పరిష్కరించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. తమ అవిశ్వాస తీర్మానానికి 74 మంది సభ్యులు మద్దతు తెలిపారని, ఇది విశాఖ ప్రజల విజయమని అన్నారు. కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూడా తమకు న్యాయం జరగలేదనే భావనతో, అభివృద్ధి కాంక్షించి అవిశ్వాసానికి మద్దతు పలికారన్నారు. గత పాలనలో జరిగిన అవినీతికి, అభివృద్ధి రాహిత్యానికి ఈ అవిశ్వాస విజయంతో ముగింపు పలికామని కూటమి కార్పొరేటర్లు పేర్కొన్నారు. రాబోయే కొద్ది కాలంలోనే విశాఖ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను కూటమి కైవసం చేసుకుంటుందని, ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని వారు తెలిపారు. ఈ విజయంతో విశాఖపట్నం తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని మరోసారి నిరూపితమైందని పలువురు కార్పొరేటర్లు అభిప్రాయపడ్డారు.

## పాకిస్థాన్‌కు చుక్క నీరు కూడా వెళ్లదు..

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 26)

సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన నేపథ్యంలో పాకిస్థాన్‌కు చుక్క నీరు కూడా వెళ్లకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుంది. ఈ విషయంపై చర్చించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసంలో శుక్రవారం కీలక సమావేశం జరిగింది. ఈ భేటీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పాకిస్థాన్‌కు నీటి ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేసే మార్గాలపై ప్రధానంగా చర్చించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పాకిస్థాన్‌కు ఒక్క చుక్క నీరు కూడా పోకుండా అన్ని చర్యలు తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. సమావేశం అనంతరం జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ మాట్లాడుతూ, "మోదీ ప్రభుత్వం తీసుకున్న సింధు జలాల ఒప్పందం రద్దు నిర్ణయం చారిత్రాత్మకమైనది, పూర్తిగా దేశ ప్రయోజనాలకు అనుగుణమైనది. సింధు నది నుంచి చుక్క నీరు కూడా పాకిస్థాన్‌కు వెళ్లకుండా చూస్తాం" అని స్పష్టం చేశారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ లో యాత్రికులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో, భారత్ బుధవారం 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి కొనసాగింపుగా, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ గురువారం పాకిస్థాన్ జలవనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తాజాకు అధికారికంగా లేఖ రాశారు. ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేస్తున్నట్లు ఆ లేఖలో స్పష్టం చేశారు.

గతంలో 1960 నాటి సింధు జలాల ఒప్పందంలోని ఆర్టికల్ 12(3) ప్రకారం, మారుతున్న పరిస్థితుల (భారీగా పెరిగిన జనాభా, స్వచ్ఛ ఇంధన ఆవశ్యకత, నీటి పంపకాలకు ఆధారమైన ప్రాథమిక అంచనాలలో మార్పులు) దృష్ట్యా ఒప్పందంపై పునఃసమీక్ష జరపాలని కోరుతూ భారత్ పలుమార్లు నోటీసులు ఇచ్చిందని లేఖలో గుర్తుచేశారు. పాకిస్థాన్ పదేపదే ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని భారత్ ఆరోపించింది. ముఖ్యంగా, జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదాన్ని నిరంతరం ప్రోత్సహిస్తోందని, దీనివల్ల ఏర్పడిన భద్రతాపరమైన అనిశ్చితి కారణంగా ఒప్పందం ప్రకారం తమ హక్కులను పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నామని భారత్ పేర్కొంది. చర్చల కోసం భారత్ చేసిన విజ్ఞప్తులకు పాకిస్థాన్ స్పందించకపోవడం కూడా ఒప్పంద ఉల్లంఘనే అని స్పష్టం చేసింది. లోతైన పరిశీలన తర్వాతే ఒప్పందాన్ని రద్దు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖర్జీ తన లేఖలో వివరించారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రణాళికల్లో భాగంగా, సింధు, జీలం, చీనాబ్ నదులపై ఉన్న డ్యామ్‌లలో పూడిక తీసి, రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని తగ్గించాలని కేంద్రం యోచిస్తోంది. జీలం ఉపనదిపై నిర్మిస్తున్న కిషన్‌గంగ, చీనాబ్ ఉపనదిపై నిర్మాణంలో ఉన్న రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టులపై పాకిస్థాన్ అభ్యంతరాలను ఇకపై భారత్ పట్టించుకోకపోవచ్చు. దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా ఈ నదులపై కొత్త డ్యామ్‌లు, మౌలిక సదుపాయాల నిర్మాణం కూడా పరిశీలనలో ఉంది.

ఈ నిర్ణయంపై ప్రపంచ బ్యాంకు లేదా ఇతర అంతర్జాతీయ సంస్థల నుంచి ఒత్తిడి వస్తే ఎదుర్కొనేందుకు న్యాయపరమైన వ్యూహాన్ని కూడా సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత్ ఈ చర్య ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో ఇతర దేశాలకు వివరించేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా కొనసాగుతాయని వారు పేర్కొన్నారు. మరోవైపు, ఒప్పందం రద్దుపై పాకిస్థాన్ తీవ్రంగా స్పందించింది. "సింధు జలాల ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు చెందిన నీటి ప్రవాహాన్ని ఆపడానికి లేదా మళ్లించడానికి చేసే ఏ ప్రయత్నమైనా యుద్ధ చర్యగా పరిగణిస్తాం, పూర్తిస్థాయి జాతీయ శక్తితో ప్రతిస్పందిస్తాం" అని పాకిస్థాన్ ప్రభుత్వం గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ మధ్య సింధు జలాల ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, తూర్పు నదులైన రావి, బియాస్, సట్లెజ్‌లపై భారత్‌కు పూర్తి హక్కులు లభించగా, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్ జలాలను వాడుకునే హక్కు పాకిస్థాన్‌కు దక్కింది.

## విద్యార్థిగా పాక్‌కు వెళ్లి.. ఉగ్రవాదిగా తిరిగొచ్చి పహల్గాం ఉగ్రవాది ఉదంతమిది..

దాదాపు 8 నెలల పాటు కుటుంబంతోనూ మాట్లాడకుండా అజ్ఞాతంలో గడిపాడు. అతడిపై ఇంటలిజెన్స్ ఏజెన్సీలు నిఘా పెట్టినా ఏ ఫలితం లేకపోయింది. అయితే, ఆ సమయంలో అతడు లష్కరే తోయిబా సంస్థలో చేరినట్లు ఆ తర్వాత నిఘా వర్గాలు గుర్తించాయి. 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'లో శిక్షణ తీసుకొని టాప్ కమాండర్ల పక్కన పని చేసినట్లు తెలిపాయి.

**గతేడాది అక్రమంగా దేశంలోకి తిరిగొచ్చి..** 2024 చివర్లో ఆదిల్ భారత్‌కు తిరిగొచ్చాడు. అయితే, అధికారిక మార్గాల్లో కాదు. పూంఛ్-రాజౌరీ సెక్టార్‌లోని నియంత్రణ రేఖను దాటి అక్రమంగా చొరబడ్డాడు. అతడి వెంట ముగ్గురు, నలుగురు పాక్ జాతీయులు కూడా వచ్చినట్లు నిఘా వర్గాల సమాచారం. ఈ సెక్టార్‌లో గుట్టలు, దట్టమైన అటవీ ప్రాంతం ఉండటంతో పెట్రోలింగ్ చేయడం కష్టమైనది. అది అనువుగా తీసుకుని ఆదిల్ ఆ సరిహద్దు గుండా దేశంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అతడి వెంట ఉన్న వారిలో హాషీమ్ మూసా అలియాస్ సులేమాన్ కూడా ఉన్నాడు. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో సులేమాన్ కూడా ఒకడు.

**అండర్‌గ్రౌండ్‌లో ఉంటూ..** సరిహద్దు నుంచి తన స్వస్థలానికి చేరుకొనే సమయంలోనూ ఆదిల్ నిఘా ఏజెన్సీలకు చిక్కకుండా చాలా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. అనంత్‌నాగ్‌లో అతడు అండర్‌గ్రౌండ్‌లో దాక్కొన్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. ఆ సమయంలో ఓ పాక్ జాతీయుడికి కూడా ఆశ్రయం ఇచ్చాడు. కొన్ని వారాల పాటు స్థానిక టెర్రరిస్ట్ సెల్స్‌తో నిరంతరం సంప్రదింపులు జరిపి పహల్గాం దాడికి కుట్ర రచించినట్లు తెలిసింది.

**దాడికి పాల్పడిందిలా..** అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేలా భారీ కుట్రకు ఆదిల్ ప్లాన్ చేసుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం అనువైన ప్రదేశం కావాలని స్థానిక ఉగ్ర విభాగాలతో అతడు చర్చించినట్లు సమాచారం. తొలుత రద్దీగా ఉండే టూరిస్టు ప్రదేశాలను ఎంచుకోవాలని అనుకున్నాడు. అయితే, భద్రతా బలగాలకు సవాలుగా ఉండే బైసరన్ లోయ అయితే తప్పించుకునేందుకు వీలు ఎక్కువగా ఉంటుందని దాన్ని ఎంచుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఏప్రిల్ 22, మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆదిల్ సహా కొంతమంది ఉగ్రవాదులు దట్టమైన పైన్ అడవులను దాటుకుని బైసరన్ పచ్చికబయళ్లను చేరుకున్నారు. ఎం-4 రైఫిళ్లు, ఏకే 47 తుపాకులతో పర్యాటకులను చుట్టుముట్టారు. పేర్లు అడిగి మరీ అతి సమీపం నుంచి వారిపై కాల్పులు జరిపారు. అనంతరం అంతే వేగంగా అక్కడి నుంచి అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆదిల్‌తో పాటు మరో ఇద్దరు ఉగ్రవాదుల ఊహాచిత్రాలను పోలీసులు విడుదల చేశారు. వీరి ఆచూకీ చెప్పినవారికి రూ.20లక్షల రివార్డు ప్రకటించారు. ముష్కరుల కోసం అనంత్‌నాగ్, పహల్గాం, చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు.

## పీఓకేలో వరద భయం.. భారత్ పనేనని పాక్ ఆరోపణ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 26)

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్ పరిధిలో ప్రవహించే జీలం నది నీటిమట్టం శనివారం మధ్యాహ్నం అనూహ్యంగా పెరగడం తీవ్ర కలకలం రేపింది. తమకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా భారత వైపు నుంచి నీటిని విడుదల చేశారని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన పనేనని స్థానికులు, పాకిస్థాన్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో, సింధు జలాల ఒప్పందాన్ని పక్కనపెట్టేందుకు భారత్ అనుసరిస్తున్న వ్యూహంలో ఇది భాగమేనని పాకిస్థాన్ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామంతో ముజఫరాబాద్ వ్యాప్తంగా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చకోఠీ సరిహద్దు నుంచి ముజఫరాబాద్ వరకు జీలం నది పరీవాహక ప్రాంతంలో నివసించే ప్రజలు నీటిమట్టం ఒక్కసారిగా పెరగడాన్ని గమనించి ఆందోళనకు గురయ్యారు. వరద ముప్పు పొంచి ఉందనే భయంతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యంగా పీఓకేలోని హట్టియాన్ బాలా ప్రాంతంలో అధికారులు 'వాటర్ ఎమర్జెన్సీ' ప్రకటించారు. హట్టియాన్ బాలా, ఘరీ దుపట్టా, మజోయ్, ముజఫరాబాద్‌లలో నీటి మట్టం గణనీయంగా పెరిగినట్లు స్థానిక వర్గాలు ధృవీకరించాయి. పరిస్థితి తీవ్రత దృష్ట్యా, నదీ తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని మసీదుల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. "ఈ హెచ్చరికలతో నదీ తీర ప్రాంత వాసుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి" అని ఘరీ దుపట్టాకు చెందిన ఒక నివాసి తెలిపారు. భారత్‌లోని అనంతనాగ్ నుంచి చకోఠీ ప్రాంతం మీదుగా ఈ నీరు ప్రవేశించినట్లు ప్రాథమిక సమాచారం. "ఇది ఊహించని పరిణామమే అయినప్పటికీ, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తామని భారత్ ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో ఇది జరగవచ్చని ముందే ఊహించాం" అని రాజకీయ విశ్లేషకుడు జావేద్ సిద్ధిఖీ వ్యాఖ్యానించారు. పాకిస్తాన్‌కు సమాచారం ఇవ్వకుండా జీలం నదిలోకి భారత్ నీటిని విడుదల చేయడమనే తాజా చర్య ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేయగలదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. "పాకిస్తాన్, భారత్‌ల మధ్య మూడు యుద్ధాలు, అనేక ప్రాంతీయ వివాదాలు తలెత్తినప్పటికీ సింధు జలాల ఒప్పందం నిలిచింది. కానీ ఇప్పుడు భారత్ ఈ దీర్ఘకాలిక ఒప్పందం నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది" అని సిద్ధిఖీ పేర్కొన్నారు. కాగా, పహల్గామ్ ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తునకు సిద్ధమని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలు మధ్యవర్తిత్వం వహించడానికి ముందుకొచ్చినట్లు తెలుస్తోంది.

## ఏపీ లిక్కర్ స్కామ్ లోకల్ కాదు...

అవయవాలు దెబ్బతిని ప్రాణాలు కోల్పోతారని స్పష్టంగా నివేదికలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో కల్తీ మద్యం తాగి ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల మంది మంచాన పడ్డారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఓట్లతో సీఎంగా ఎన్నికైన వ్యక్తి వారి జేబుల్లోని డబ్బును లాక్కోవడమే గాక వారి ప్రాణాలను తీసేయడం దుర్మార్గమన్నారు. కసిరెడ్డి అండ్ బ్యాచ్ మద్యం వ్యాపారాన్ని తమ చేతుల్లోకి తీసుకుందని, డిస్టలరీలను తమ గుప్పెట్లో పెట్టుకుని నాసిరకమైన మద్యం తయారు చేయించిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆరోపించారు. బ్రాండ్ ను బట్టి క్రేట్(48 బాటిల్స్) కు రూ.150 నుంచి రూ.600 చొప్పున కమీషన్ వసూలు చేశారని, అనఫిషియల్ సేల్ తో ఒక్కో క్రేట్ కు రూ.10 వేల వరకు ఆర్జించారని తెలిపారు. నడిబజారులో జరిగిన ఈ స్కామ్ ప్రత్యక్షంగా కనిపిస్తోంది.. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈడీ, సీబీఐలను రంగంలోకి దించాలని ఆయన కోరారు. రూ.1000 లంచం తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగిని ఏసీబీ అరెస్ట్ చేసి జైలుకు పంపుతుందని, వేల కోట్లు దోచేసి ప్రజల ప్రాణాలు తీసేసిన వారికి ఏ శిక్ష వేయాలని ప్రశ్నించారు. క్యాష్ ట్రాన్సాక్షన్ కరెక్ట్ అని, ఈ మందు తాగినందున ఎవరూ చనిపోలేదు అని వైసీపీలోని పెద్ద నాయకులు, జగన్ రెడ్డి రైట్లు, లెఫ్టులు ఎవరైనా చెప్పగలరా అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి సవాల్ చేశారు. మధ్యలో లక్షల క్రేట్ల మద్యం సేల్ ఎందుకు తగ్గిపోయిందో సమాధానం చెబుతారా అని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి కల్తీ మద్యం పోసి ప్రాణాలు తీయడం క్షమించరాని నేరం అన్నారు.

## ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం.. పెద్దఎత్తున ఆయుధాలు స్వాధీనం

ఉత్తర కశ్మీర్ జిల్లాలోని సెడోరి నాలా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు సోదాలు నిర్వహించాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించాలనే లక్ష్యంతో ముష్కరులు కుట్రపన్నుతున్నారని సమాచారం వచ్చిందని.. ఈ సమయంలో సైన్యం వారి స్థావరాలను ధ్వంసం చేయడం ఉగ్రవేటలో మరో ముందడుగని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో పౌరులు ప్రాణాలు కోల్పోవడంతో భారత ప్రభుత్వం ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపుతోంది. నాటి నుంచి భద్రతా దళాలు వారి ఆచూకీ కోసం రాష్ట్రం అంతటా జల్లెడపడుతున్నారు. మరోవైపు కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తున్న ఇద్దర్ని భద్రతా దళాలు శనివారం అరెస్టు చేశాయి. ఖైమోహ్ ప్రాంతంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అయితే, వారి పేర్లు, ఇతర వివరాలను భద్రతా సిబ్బంది వెల్లడించలేదు.

## ఏపీ లిక్కర్ స్కాం కేసు

అనంతరం అతడిని విజయవాడకు తరలించి, నేడు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి, శ్రీధర్‌రెడ్డికి మే 6 వరకు జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం కుంభకోణానికి సంబంధించి జరిగిన కుట్రలో శ్రీధర్ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు సిట్ అధికారులు ఆరోపిస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారం చేపట్టిన తర్వాత, కొత్త మద్యం విధానం పేరుతో నెలనెలా రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు అక్రమంగా ముడుపులు వసూలు చేసేందుకు కుట్ర జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ కుట్రలో భాగంగా జరిగిన కీలక సమావేశాల్లో శ్రీధర్‌రెడ్డి కూడా పాల్గొన్నారని సిట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమావేశాల్లో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, నాటి ప్రభుత్వ ఐటీ సలహాదారు రాజ్ కెసిరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, అదే సంస్థ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్ వంటి వారు కూడా పాల్గొన్నట్లు కేసు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. ఈ ఆరోపణల నేపథ్యంలోనే సిట్ అధికారులు శ్రీధర్‌రెడ్డిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

### అప్పటిలా కాదు... ఇప్పుడు ప్రతి గ్రామంలో మనం ఉన్నాం

ఎన్ని కేసులు బనాయించినా ప్రజల మద్దతు తమకే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఎదురైనా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని జగన్ ఈ సమావేశం ద్వారా సంకేతాలు పంపారు. ప్రభుత్వ చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగి, అది అంతిమంగా తమ పార్టీకే లాభిస్తుందని అభిప్రాయపడ్డారు.

## నేడు కావలిలో ఎన్‌డీఏ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం

### వేలాదిమంది తరలి రావాలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 26)

ఆదివారం కావలి పట్టణంలోని విట్స్‌కాలేజీ పక్కన మినీ స్టేడియంలో ఆత్మీయ సమావేశం జరుగుతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఈ సమావేశం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:30గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొంటారు. కావున నియోజకవర్గంలోని జనసేన, బిజెపి, టిడిపి కార్యకర్తలు అందరూ వేలాదిగా తరలి రావాలని ఆయన కోరారు.

## పిల్లలు, మహిళలు, కార్మికులకు బెడ్‌షీట్లు పంపిణీ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

ప్రకాశం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో బానిస శ్రమ వెట్టి చాకిరి నుంచి రక్షించబడి అల్లూరు పునరావాస కేంద్రంలో రక్షింపబ డుతున్న పిల్లలు, మహిళలు, కార్మికులకు ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి బెడ్ షీట్లు, టవల్స్, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, స్వీట్లు, చిరుతిండ్లు ,మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మూగజీవాల ఆరోగ్యానికి పశువైద్యులు అందిస్తున్న బహుళ సేవలను మననం చేసుకునేందుకు ఏటా ఏప్రిల్ నెలలో చివరి శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా జరుపుతున్న సందర్భంగా అల్లూరు పునరావాస కేంద్రంలోని బానిస శ్రమ నుండి రక్షింపబడిన కుటుంబాల్లోని పిల్లలు, మహిళలు, కార్మికులకు అవసరమైన వస్తువులు పంపిణీ చేయడం హర్షనీయమని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య అధికారులు డాక్టర్ శోభ, డాక్టర్ అనిల్, డాక్టర్ భరత్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 303 అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

### రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 26)

నెల్లూరు రూరల్ 26వ డివిజన్ల ముఖ్య తెలుగుదేశం పార్టీ నేతలతో 303 అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. శనివారం సాయంత్రం 5 గంటలకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న 303 అభివృద్ధి పనుల పురోగతిపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి 26 డివిజన్ల ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. దాదాపుగా 303 అభివృద్ధి పనులు కాకుండా అదనంగా మరో 20 పనులు కూడా మే 15వ తేదీ లోపల పూర్తయ్యే అవకాశం ఉందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. దాదాపు 330 అభివృద్ధి పనులు సుమారు 40 కోట్ల రూపాయల వ్యయం అవుతుందన్నారు. 303 అభివృద్ధి పనులలో దాదాపుగా 90 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మే 15 తేదీ ఉదయం 9 గంటలకు 303 అభివృద్ధి పనులు 606 మంది పార్టీ కార్యకర్తలు చేతుల మీదుగా ప్రారంభమైనట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

# కొండపి పోలీస్ స్టేషన్‌లో యోగా



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 26)

కొండపి సర్కిల్ పరిధిలోని సిబ్బందితో కలిసి శనివారం కొండపి పోలీస్ స్టేషన్ నందు యోగా నిర్వహించారు. సిబ్బంది ఖచ్చితంగా శారీరక వ్యాయామం చేయాలని, క్రమశిక్షణతో మెలగాలని, కేసు పరిశోధనలో సాంకేతికతను ఉపయోగించుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. అదేవిధంగా మండలాల్లో ఉన్న గ్రామాలను ప్రతి సిబ్బందికి కేటాయించడం జరిగింది. గ్రామాల్లో జరిగే ప్రతి కార్యక్రమాన్ని సిబ్బంది పరిశీలించి ఎస్ఐకి తెలియపరచాలని గ్రామాల్లో ఉన్న రౌడీ షీట్లను సస్పెక్ట్ షీట్లను వెరిఫై చేస్తూ ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉంచాలని, మైనర్ బాలురు వాహనాలు నడపకుండా కౌన్సిలింగ్ ఇవ్వాలని, ట్రాక్టర్స్‌లో జనాభా నెక్కించుకొని ప్రయాణం చేయరాదని తెలిపారు.







షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## వీరయ్య చౌదరి హత్య కేసులో ముద్దాయిల కోసం
# ఎస్పీ ఏ ఆర్ దామోదర్ స్వయంగా గాలింపు చర్యలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

ఒంగోలులో జరిగిన టీడీపీ సీనియర్ నేత ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులోని నిందితులను పట్టుకునేందుకు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ స్వయంగా రంగంలోకి దిగారు. ఒంగోలు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం బైక్ పై తిరిగి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను త్వరగా పట్టుకుని చట్ట ప్రకారం శిక్షించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా ఎస్పీ పట్టణంలోని రద్దీ ప్రాంతాలు, అనుమానాస్పదంగా ఉండే ప్రదేశాలు, నిందితులు తలదాచుకునే అవకాశం (తరువాయి 4లో...)

## వికసిత భారత్ కాదిది...
# విసిగిపోయిన భారత్

11 ఏళ్ల కాలంలో ప్రధాని చేసింది ఏమీ లేదు
విదేశీ పర్యటనలు చేయడం తప్ప
దేశంలో 50 శాతం బ్యాంకు రుణాలు మార్వాడీలు, గుజరాతీలకే
ఎస్సీ వర్గీకరణ జరగాల్సింది చిన్నపాటి ఉద్యోగాలలో కాదు
ప్రభుత్వ కాంట్రాక్టుల్లో....
పాస్టర్ ప్రవీణ్ ది హత్య కాదు
చంద్రబాబును ముఖ్యమంత్రి చేసింది కాంగ్రెస్ పార్టీనే
ఇకపై దళితుల ఇళ్ల నుండే మీడియా సమావేశాలు నిర్వహిస్తా
మీడియా సమావేశంలో మాజీ కేంద్రమంత్రి,
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

11 ఏళ్ల మోదీ పాలనలో జరిగింది వికసిత భారత్ కాదని, విసిగిపోయిన భారత్ అని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ విమర్శించారు. ఒంగోలులోని ఎంసీఏ భవన్లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ పాలనలో గత 11 సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధికర పని ఒకటీ కనిపించడం లేదన్నారు. రోజుకు నాలుగు సార్లు బట్టలు మార్చుకోవడం తప్ప ఏమి చేయలేదు అని విమర్శించారు. విదేశాల పర్యటనలు చేయటమే పరిపాలన చేయటం అని మోదీ అనుకుంటున్నారని అన్నారు. విదేశీ పర్యటన సందర్భంగా ఆయన విదేశాలలో జరిపిన చర్చల గురించి, దేశానికి చేస్తున్న అభివృద్ధి గురించి 11 సంవత్సరాల పాలనలో మోడీ ఎప్పుడు, ఎక్కడా కనీసం మీడియా సమావేశమైన నిర్వహించిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. గతంలో ప్రధానిగా పనిచేసిన పీవీ నరసింహారావు విదేశీ పర్యటన సందర్భంగా మీడియా సమావేశాలు ఏర్పాటు (తరువాయి 4లో...)

# మత్స్యకార కుటుంబాల జీవనం కోసం ఇచ్చే భృతి

రూ.20 వేలకు పెంపు
జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

4



# ఆత్మకూరు అభివృద్ధి, సమస్యలపై నివేదిక తయారుచేయాలి

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
ముఖ్యమంత్రి ఆత్మకూరు పర్యటన ఏర్పాట్లపై
కలెక్టర్, ఎస్పీతో చర్చించిన మంత్రి ఆనం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 26)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మకూరు పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలెక్టర్,ఎస్పీలకు సూచించారు. శనివారం ఉదయం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఆత్మకూరు పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ మే నెల 1న సీఎం పర్యటన రూట్‌మ్యాప్, కార్యక్రమాల వివరాలు, బందోబస్తు తదితర అంశాలను ప్రధానంగా చర్చించారు. ఆత్మకూరులో బీసీ రెసిడెన్షియల్ హాస్టల్ వద్ద హెలీప్యాడ్, నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవం, పైలాన్ ఏర్పాటు, మేడే సందర్భంగా నారంపేట ఎంఎస్ఎంఈ పార్కు వద్ద ఆటో కార్మికులు, గృహనిర్మాణ కార్మికులు, ఇతర కార్మికులతో ముఖాముఖి, నెల్లూరుపాలెం ఎస్టీ కాలనీలో పింఛన్ల పంపిణీ, ఆత్మకూరు





ఏఎంసి గ్రౌండ్‌లో ప్రజావేదిక, పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాట్లపై మంత్రి ఆనం చర్చించారు. నారంపేటలోని ఎంఎస్ఎంఈ పార్కు పైలాన్ ఆవిష్కరణ, ప్రజావేదిక ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యాలయ మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు. నెల్లూరు పాలెం ఎస్టీ కాలనీలో పెన్షన్‌ల పంపిణీ,యువతతో ముఖాముఖి

4

# విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 26)

విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని ఆర్ఎంఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 6 వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి




తల్లితండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ వెనుకబడిన మార్కాపురంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్ నెలకొల్పి విద్యార్థులకు మంచి ఇంగ్లీష్ విద్యను అందించడం అభినందనీయమని అన్నారు. మార్కాపురం పట్టణం ఒకప్పుడు ఎటువంటి అభివృద్ధి లేకుండా ఉన్నదని, ఇప్పుడు కాలనీలలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టటం జరిగిందన్నారు. ఒకప్పుడు త్రాగునీటికి కూడా ఇబ్బంది పడ్డ మార్కాపురం పట్టణం నేడు పట్టణానికి తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. ఈ ప్రాంతం నుండి ఐఏఎస్, (తరువాయి 4లో...)

# మూగజీవాలకు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయం




జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

మూగజీవాలకు పశు వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం ఒంగోలులోని ఎన్టిఆర్ కళాక్షేత్రం నందు జరిగిన ప్రపంచ పశువైద్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఈ నెల 22న ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. అనంతరం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు పంపిన సందేశాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పవిత్రమైన వైద్య వృత్తిలో ఉండి మూగ జీవాలకు వైద్య సేవలు అందిస్తున్న పశు సంవర్ధక శాఖ సిబ్బందికి ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని తెలుపుతున్నట్లు అన్నారు. మానవాళికి ప్రత్యక్షంగానే ఉపయోగపడే మూగ జీవాలకు అందిస్తున్న బహుళ సేవలను మననం చేసుకునేందుకు ఏటా ఏప్రిల్ నెలలో చివరి శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా జరుపుకోవడం జరుగుచున్నదన్నారు. పశువులకు వైద్య సేవలతో పాటు పశువుల నుంచి సోకే జూనోటిక్ వ్యాధుల నివారణలో పశు వైద్యులు ప్రధానపాత్ర పోషిస్తున్నారన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లా ఒక విజన్ (తరువాయి 4లో...)

## వికసిత భారత్ కాదిది... విసిగిపోయిన భారత్

చేసి విదేశాలలో జరిగిన చర్చల గురించి, ఈ దేశానికి వస్తున్న అభివృద్ధి కర ప్రాజెక్టుల గురించి వివరించే వారని గుర్తు చేశారు. దేశంలో ఆకలి,, ఆవేదన, నిరుద్యోగం, కన్నీరు కనిపిస్తున్నాయని, ఇదేనా వికసిత భారత్ అని ఎద్దేవా చేశారు. నిజంగా భారతదేశం వెలిగిపోతుందా అని ప్రశ్నించారు. నిత్యవసర వస్తువుల ధరలు బాగా పెరిగాయని, టాక్స్ ల భారాలు విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజలలో అసంతృప్తి బాగా పెరిగింది అన్నారు. ఒంగోలులో వీరయ్య చౌదరి హత్యకు గురైతే ప్రభుత్వం హడావుడి చేస్తుందన్నారు. కారంచేడు ఘటనలో ఆరుగురి దళితుల రొమ్ములు కోస్తే ఒక్కరికైనా శిక్ష పడిందా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలకు దళితులపై చిత్తశుద్ధి లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్, వక్రీకరణ ఆర్డినెన్స్ అంటూ విమర్శించారు. వర్గీకరణ కావాల్సింది నర్సు ఉద్యోగాలలో, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలలో, స్కూల్ టీచర్ల ఉద్యోగాలలో కాదని, ప్రభుత్వ కాంట్రాక్టులలో, చీమకుర్తి గనుల లో అని పేర్కొన్నారు. దేశ జనాభాలో 25 శాతం ఉన్న ఎస్సీ ఎస్టీలకు ఒక్క శాతం బ్యాంకు రుణాలు మాత్రమే అందుతున్నాయి అన్నారు. 50 శాతం గా ఉన్న ఓబీసీలకు కేవలం రెండు శాతం మాత్రమే బ్యాంకు రుణాలు అందుతున్నాయన్నారు. మార్వాడీలకు, గుజరాతీలకు 50 శాతానికి పైగా బ్యాంకు రుణాలు ఇస్తున్నాయని, వారు వేల కోట్లు రుణాలు తీసుకొని ఎగ్గొడుతున్నారని ధ్వజమెత్తారు. వేల మందికి ఉద్యోగాలు ఇచ్చి అన్నం పెట్టిన పాస్టర్ ప్రవీణ్ ది హత్యగా తాను భావించడం లేదన్నారు. హైదరాబాదు నుండి రాజమండ్రి కి మోటర్ బైక్ పై ప్రవీణ్ రావాల్సిన అవసరం లేదన్నారు. చంద్రబాబుకు బిజెపి చేసింది ఏమీ లేదన్నారు. ఎన్టీఆర్ ని దించి తెలుగుదేశం పార్టీని చంద్రబాబు లాక్కుంటే, నాటి ప్రధాని పీవీ నరసింహారావు సంపూర్ణ సహకారంతో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారని పేర్కొన్నారు. చంద్రబాబుకు ఎమ్మెల్యే సీటు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. తాను ఇకనుండి దళితుల ఇళ్లలోనే ప్రెస్మీట్లు పెడతానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. జమ్మూకాశ్మీర్ ఉగ్ర దాడిని శాంతియుత చర్చల ద్వారా పరిష్కరించుకోవలసిన అవ సరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయేంద్ర బహజన్ పాల్గొన్నారు.

## వీరయ్య చౌదరి హత్య కేసులో ముద్దాయిల కోసం ఎస్పీ ఏ ఆర్ దామోదర్ స్వయంగా గాలింపు చర్యలు

ఉన్న ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు బృందాలు ఇప్పటికే వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నప్పటికీ, ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణ దర్యాప్తునకు మరింత ఊతమిస్తుంది. నిందితుల గురించి ఏ చిన్న సమాచారం తెలిసినా వెంటనే ఒంగోలు పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి ఎస్పీ తెలిపారు.

## ఆత్మకూరు అభివృద్ధి, సమస్యలపై నివేదిక తయారుచేయాలి

ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించాలన్నారు. శాఖలవారీగా నివేదికలు తయారు చేసి ముఖ్యమంత్రికి అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆత్మకూరు అభివృద్ధి, సమస్యలపై ఆయా శాఖల వారీగా సమగ్ర నివేదిక తయారుచేయాలని సూచించారు. శుక్రవారం రాత్రి నెల్లూరు పాలెం సమీపంలోని ఎస్టీ కాలనీని తాను సందర్శించానని... అక్కడ గిరిజనులు ఇళ్ల స్థలాలు లేవని, వర్షం వస్తే ఇల్లు ఊరుస్తున్నాయని తమకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని, అలాగే అక్కడే యువతతో కూడా తాను మాట్లాడానని, వారిలో చాలామంది ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లుగా, కూలీలుగా పనిచేస్తున్నారని.. ఈ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. సోమశిల జలాశయ మరమ్మతు పనులు, హైలెవల్ కెనాల్, తెలుగుగంగ పనులు, విక్రమసింహపురి యూనివర్శిటీ ద్వారా ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు, సంగం బ్యారేజీ నుంచి జాతీయ రహదారికి అనుసంధానం చేయడం తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే విధంగా నివేదికలు రూపొందించాలని కోరారు. సీఎం పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్, డయాస్, బందోబస్తు, పార్కింగ్, రూట్‌మ్యాప్‌పై ఎస్పీతో మంత్రి ప్రత్యేకంగా చర్చించారు. నెల్లూరులో నూతన కలెక్టరేట్ భవనం ఏర్పాటు, అధునాతన అతిథిగృహం, ఆత్మకూరు బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, ఆదూరుపల్లి రెసిడెన్షియల్ పాఠశాలల ఇంటర్‌మీడియట్ వరకు అప్‌గ్రేడ్, సంగంలో ఐటిఐ ఈ ఏడాది నుంచే ప్రారంభం తదితర అంశాలు కూడా కలెక్టర్ మంత్రి మధ్య చర్చకు వచ్చాయి. గతంలో నెల్లూరులో అన్ని ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండాలని ప్రణాళిక రూపొందించామని, అయితే జిల్లా పరిషత్, ఎస్పీ కార్యాలయం, కార్పొరేషన్ కార్యాలయం తదితర భవనాలు నిర్మించగలిగామని, కలెక్టరేట్ మాత్రం మిగిలి పోయిందని, ఈ ప్రభుత్వంలో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. దీనికి సంబంధించిన ఒక నోట్‌ను కూడా అందించాలని కలెక్టర్‌ను మంత్రి ఆనం కోరారు.

## మత్స్యకార కుటుంబాల జీవనం కోసం ఇచ్చే భృతి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

ప్రతి ఏటా 2 నెలల పాటు ఉండే చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాల జీవనం కోసం ఇచ్చే భృతిని రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ. 20 వేలకు పెంచడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మత్స్య శాఖ ఏర్పాటు చేసిన సముద్ర చేపల వేట నిషేధ కాలంలో నిషేధ భృతి పంపిణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా పాల్గొని, మెగా చెక్కు ను మత్స్యకారులకు అందచేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చేపల వేట నిషేధం వలన ప్రభావితమయ్యే ప్రతి మత్స్యకారుని కుటుంబానికి ఇచ్చే సహాయం భృతిని రాష్ట్ర ప్రభుత్వం పది వేల నుండి ఇరవై వేల వరకు పెంచడం జరిగిందని అన్నారు. ఈ పథకం ద్వారా ప్రకాశం జిల్లాలో 2025-26 సంవత్సరానికి గాను 5,501 మంది సముద్ర మత్స్యకారులకు ఒక్కో కుటుంబానికి ఇరవై వేల రూపాయల చొప్పున మొత్తం పదకొండు కోట్ల ఇరవై వేల రూపాయలు లబ్ధి చేకూరనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కొత్తపట్నం, ఒంగోలు, టంగుటూరు, సింగరాయకొండ, నాగులుప్పలపాడు మండలాలకు చెందిన 5,501 మంది మత్స్యకారులకు ఈ భృతిని అందచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా శ్రీకాకుళం జిల్లాలో ఈ భృతిని మత్స్యకారులకు అందచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎంపిపి అంజిరెడ్డి, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు పేరయ్య, మత్స్యకార సంఘాల ప్రతినిధులు తిరుపతిరావు, సున్నం తిరుపతి, రాయం శ్రీనివాసరావు, వివిధ మత్స్య కార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాలకు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయం







డాక్యుమెంట్ ను రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లా విజన్ డాక్యుమెంట్ లో లైవ్ స్టాక్ సెక్టార్ 9, 735 కోట్ల రూపాయల జీడీపీ తో మొదటి స్థానంలో ఉందన్నారు. అలాగే పాల ఉత్పత్తి లో రాష్ట్రంలో 5వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రకాశం జిల్లా వెనుకబడిన జిల్లా అని, 17,525 కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పి 4 విధానంలో వీరిని అభివృద్ధి చేసేలా 15 శాతం వృద్ధి రేటు తో ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎక్కువ శాతం పేద కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారాపడి జీవిస్తున్నారన్నారు. పాడి పరిశ్రమలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పశుసంవర్ధక శాఖ సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా, మెమొంటోలు అందచేసారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీ ప్రసన్న, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీ రాణి, పశు సంవర్ధక శాఖకు సంబంధించి వైద్యులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి







ఐపీఎస్, ఐఆర్ఎస్ లో ఉద్యోగాలు విద్యార్థులు సాధించడం అరుదన్నారు. ఇప్పటి నుండి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి ప్రణాళికతో చదివి దానిని సాధించాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ ఛైర్మన్ ఎం వెంకటరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు మౌలాలి, పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## శభాష్ సైదా ఏపీసీసీ చీఫ్ షర్మిలరెడ్డి ప్రశంస

### పార్టీ కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్రంలోనే ద్వితీయ ర్యాంకు సాధించిన షేక్ సైదా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

విజయవాడ ఏ వన్ కన్వెన్షన్ హాల్ జరిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్రంలోని 26 జిల్లాల పార్టీ అధ్యక్షుల పనితీరుపై సమీక్ష నిర్వహించిన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్నికై గత ఆరు నెలలుగా జిల్లాలో పార్టీ కార్యక్రమాలు



విస్తృతంగా చేపట్టడంతో పాటు పార్టీలో నీ నాయకులందరినీ సమన్వయ పరుచుకుంటూ పార్టీ పురోగతికి తోడ్పడడంతో పాటు ప్రతినిత్యం టివి డిబేట్స్‌లో పాల్గొంటూ పార్టీ వాణిని బలంగా వినిపిస్తున్నటువంటి షేక్ సైదాకు పదికి 9 మార్కులు ఇచ్చి పార్టీ నాయకుల కరతాల ధ్వనుల మధ్య అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ పురోగతికి, పూర్వ వైభవానికి అందరూ సమిష్టిగా పని చేయాలి లని వైఎస్ షర్మిల రెడ్డి కోరారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి పార్లమెంట్ సభ్యులు ఏపీ ఇన్చార్జ్ మాణిక్యం ఠాగూర్, సిడబ్ల్యూసి సభ్యులు మాజీ మంత్రి రఘువీరారెడ్డి, సిడబ్ల్యూసి సభ్యులు పూర్వ పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, తులసిరెడ్డి, జెడి శీలం, మస్తాన్‌వలి, ఏఐసీసీ కార్యదర్శిలు పాలక్ వర్మ, గణేష్ యాదవ్ వివిధ జిల్లాల అధ్యక్షులు నగర అధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ సైదాకు అభినందనలు తెలిపారు.

## చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యం

లాడ్జిలు, హోటల్, వాహనాలు, పలు ప్రదేశాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్న ప్రకాశం జిల్లా పోలీసులు
లాడ్జి, హోటల్స్ అనుమానాస్పదంగా అన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి
చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు
రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరండి
జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్











(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ,చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జి, డార్మిటరీస్, హోటల్, వాహనాలను, పలు ప్రదేశలను తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని లాడ్జిల్లో పోలీసులు ప్రతీ గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, లాడ్జిలలో బస చేసిన వ్యక్తుల వివారాలను పరిశీలించి, కోత్త వ్యక్తులను ప్రశ్నిస్తూ వివరాలపై ఆరా తీశారు. అదేవిధంగా అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించి వారి యొక్క వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ ఐడెంటిఫికేషన్ ద్వారా తనిఖీ చేయటం నేర నియంత్రణకు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. లాడ్జీలలో బస చేసే వ్యక్తుల నుంచి ఆధార్ కార్డులు, ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్ నిర్వహించాలని నిర్వహకులకు సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వరాదని, అనుమానాస్పద వ్యక్తులు లాడ్జిల్లో బస చేసిన సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావిచ్చినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పలు ప్రదేశాలను డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తూనే హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారిపై, త్రిబుల్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంకన్ డ్రైవింగ్ తదితర రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులపై ఎంవి యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ మద్యం,గంజాయి వంటి మాదకద్రవ్యాలు రవాణా జరగకుండా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## కాశ్మీర్ ఉగ్రదాడికి నిరసనగా జర్నలిస్టుల కొవ్వొత్తుల ప్రదర్శన

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 26)

కాశ్మీర్ ఉగ్రవాద దాడికి నిరసనగా నెల్లూరు జర్నలిస్టులు స్థానిక గాంధీ బొమ్మ వద్ద శనివారం కొవొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ కాశ్మీర్ పహల్గాం పర్యటకులపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు. భారతదేశంలో శాంతిని కాంక్షిస్తుందని ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు అందుకు తగ్గ విధంగా బదిలిస్తుందని వారన్నారు. ఉగ్రవాదులు విచక్షణారహితంగా అమాయకులైన పర్యాటకులను చంపడం మానవత్వానికి తీరని మచ్చని వారు పేర్కొన్నారు. ప్రభుత్వాలు తీసుకునే ఏ నిర్ణయానికైనా జర్నలిస్టుల పూర్తి మద్దతు ఉంటుందని వారన్నారు. దాడి చేసిన టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. టెర్రరిస్టు దాడిలో చనిపోయిన మృతులకు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ జయ ప్రకాష్, నెల్లూరు జిల్లా కోశాధికారి గడ్డం హనోక్, సామ్నా జిల్లా గౌరవ అధ్యక్షులు పురుషోత్తం బాబు, జిల్లా అధ్యక్షులు వేలూరు సుబ్బారావు, రెడ్డి, ప్రధాన కార్యదర్శి చక్రం దినేష్ కుమార్, కోశాధికారి సునీల్ గవాస్కర్, సహాయ కార్యదర్శి ఎనోష్ మస్తానయ్య, కార్యవర్గ సభ్యులు అక్మల్, సీనియర్ పాత్రికేయులు సింహపురి వాయిస్ ఎడిటర్ హుమాఇన్, వెంకటరాజు, నెల్లూరు వాసులు సునీల్, విజయ్ కుమార్ రెడ్డి, ఎస్ కే అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు

# చెన్నకేశవ స్వామి ఆలయంపై అధికారులు స్పందించాలి

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 26)

మండలంలోని నల్లగండ్ల పంచాయతీ పరిధిలోని చిన్న గొల్లపల్లి చెన్నకేశవ స్వామి ఆలయ తిరుణాల నిర్వహణ కార్యక్రమంలో వచ్చిన వివాదంపై ప్రభుత్వం స్పందించి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆలయం శ్రీపతి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ధర్మకర్తలుగా ప్రారంభమై బ్రిటిష్ కాలం నుండి నిర్మాణంలో ఉన్నదన్నారు. దాదాపు 500 సంవత్సరాల నాటి చరిత్ర కలిగిన ఆలయం వందలాది ఎకరాల భూములు దేవాలయం పేరుతో ఉన్న ఆస్తులు వంశపార్యపరయంగా వ్యక్తులకు చెందుతుందా లేదా దేవాదాయ శాఖ పరిధిలో ఉండి ప్రభుత్వానికి చెందుతుందా అనేది నిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆలయ పరిధిలో పోతురాజులు కన్నమ నీడులు నాయి బ్రాహ్మణ రజక అనేక సామాజిక తరగతులు సంవత్సరాల తరబడి చాకిరి చేస్తున్నారన్నారు. వీరి సేవకు నేటికీ ఎలాంటి ప్రతిఫలం లేదని తెలిపారు. చాకిరి మాన్యాలు ఉంటే వాటి వాస్తవ పరిస్థితులు సంబంధిత వర్గాలకు తెలియ పరచాలని, లేకపోతే అక్కడ సేవ చేస్తున్నటువంటి సామాజిక తరగతులకు దేవాదాయ భూమిని ఉపాధి కొరకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం దేవాదాయశాఖ వారు ఈ గుడి, వీటి ఆస్తులు మొత్తం ప్రభుత్వ పరిధిలో ఉందని చిన్న గొల్లపల్లి, నల్లగండ్ల, పెద్ద గొల్లపల్లి,



దొడ్డి చింతల, తదితర గ్రామాలలో 127 ఎకరాల 64 సెంట్లు భూమి అన్యాక్రాంతమైనట్లు ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ భూములను 3.4.2023న నల్లగండ్ల గ్రామపంచాయతీ తీర్మానం ద్వారా వేలంపాట వేసినట్లు, అదే విధంగా చిన్న గొల్లపల్లి దొడ్డిచింతల గ్రామాల్లో సైతం గ్రామాల్లో దండోరా వేయించి వేలంపాట ద్వారా ఈ భూములను కౌలుకిస్తున్నట్లు ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గత ఏడాది రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ పోరేటి శ్రీనివాసరెడ్డి ఈ సమస్యపై విచారణ చేశారని తెలిపారు. గత సంవత్సరం తిరుణాళ్ల కార్యక్రమం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వమే నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం దేవాదాయ శాఖ ఈవో, రెండు వేరు వేరు ప్రచార కరపత్రాలు విడుదల చేశారని, మే నెల 15 తేదీ నుండి 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు చిన్న గొల్లపల్లి చెన్నకేశవ స్వామి ఆలయ పరిధిలో పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రణాళికను విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమం ఎవరు చేస్తున్నారు అనేది స్పష్టత లేకుండా ప్రజలను అయోమయంకి గురి చేస్తున్నారని తెలిపారు. జిల్లా పరిధిలో అనేక గ్రామాల నుంచి వందలాది మంది ఇక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొనటానికి ప్రజలు వస్తుంటారని, వీరికి కనీస సౌకర్యాలు కూడా ఉండటం లేదన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని, ఒక స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇళ్లు పూర్తి చేయాలి

### ఎంపీడీవో డాక్టర్ సుజాత



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 26)

మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డాక్టర్ సుజాత అధ్యక్షతన శనివారం గృహ నిర్మాణ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇల్లు పూర్తి చేయాలని పూర్తి చేయకపోతే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియపరిచింది. అనంతరం జిఎస్ డబ్ల్యూఎస్ సర్వే గురించి ఐజిఓటి కర్మయోగి లాగిన్ పక్రియ గురించి, ఎస్సీ కార్పొరేషన్ రుణాల గురించి,బీసీ కార్పొరేషన్ రుణాల గురించి, టైలరింగ్ శిక్షణ గ్రామపంచాయతీ కార్యక్రమాల గురించి, పిఆర్ వన్ గురించి, ఎండలు ఎక్కువగా నీరు సౌకర్య లభ్యత గురించి, ఫ్లోరినేషన్ గురించి ఎస్డబ్ల్యూపిసి తదితర విషయాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, హౌసింగ్ సూపర్వైజర్ సుధీర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## క్విస్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ గతివిధి

### పాల్గొన్న 600 మంది విద్యార్థులు

### పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ గతివిధి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కళాశాలలోని రామానుజన్ సెమినార్ హాల్లో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి తెలియజేశారు. కళాశాలకు చెందిన 600 మంది విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, చెట్లు పెంచడం తదితర అంశాలపై మాట్లాడారు. అద్భుతంగా ప్రసంగం ఇచ్చిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ శివాజీ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించి, దాన్ని ఎలా నివారించాలో విద్యార్థులకు తెలియజేశారు. పర్యావరణాన్ని కాపాడతామని, అది తమ బాధ్యతగా తీసుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత అని ఈ సందర్భంగా క్విస్ కళాశాల ప్రిన్సిపల్ వై.వి. హనుమంతరావు అన్నారు. పాత రోజుల్లో ప్రతి ఒక్కరు పాటించే పద్ధతులు మనం అవలబిస్తే ఆరోగ్యంగా ఉంటామని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ గతివిధి ప్రతినిధులు చంద్రశేఖర్, అశోక్, డాక్టర్ కాలె మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని క్విస్ కళాశాల ఈసీఈ హెచ్ వోడీ డాక్టర్ సి.హెచ్. హిమబిందు, ఎంసీఏ హెచ్ వోడీ డాక్టర్ కొండల్ రావు, బీ ఫార్మసీ హెచ్ వోడీ డాక్టర్ రేవతి, డాక్టర్ విద్యానాథ బాబు పర్యవేక్షించారు.






# ఉగ్రవాద దుశ్చర్యలను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ర్యాలీ

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 26)

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిరూపంగా ఉన్న భారత దేశంలో విభిన్న కులాల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉగ్రవాదులు జమ్మూకాశ్మీర్లోని పహల్గమ్‌లో పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరపడం అమానుషమని ఏపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపియూడబ్లూజే) జిల్లా అధ్యక్షులు ఎన్‌వి రమణ అన్నారు. జమ్ము కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఏపీడబ్ల్యుయుజే ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో శాంతి ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక శతాబ్దాలుగా భారత్లో కులాలకు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు స్నేహపూర్వకమైన వాతావరణంలో జీవిస్తున్నారని అన్నారు. ఇలాంటి దేశంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉగ్రవాదులు అమాయకులపై కాల్పులు జరిపి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పర్యాటక రంగానికి మారుపేరుగా ఉన్న జమ్మూ కాశ్మీర్ కు జాతీయంగా, అంతర్జాతీయంగా టూరిస్టులు లక్షల సంఖ్యలో వస్తుంటారని, దీనివలన ఆ రాష్ట్రానికి మంచి ఆదాయం రానుండడంతో అక్కడి ప్రజలు పర్యాటక రంగంపైనే ఆధారపడి అధిక సంఖ్యలో జీవనం కొనసాగిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఉగ్రవాదులు కాల్పులు జరిపినప్పటికీ ఆయా ప్రాంతాల్లో ఉన్న పర్యాటక గైడులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో బాధితులకు అండగా ఉండి వైద్య సహాయం




అందించడమే కాకుండా,సురక్షితంగా వారి గమ్యస్థానాలకు వెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేశారని, ఈ సందర్భంగా పహల్గమ్ ముస్లిం ప్రజలను అభినందిస్తున్నామని ఆయన అన్నారు. కాల్పులు జరిపి అమాయక ప్రజల ప్రాణాలను తీయడం ద్వారా ఉగ్రవాదులు సంబరపడుతున్నారని, ఇది వారి మూర్ఖత్వానికి నిదర్శనమని అన్నారు. గతంలో కూడా ఉగ్రవాదులు అనేక సందర్భాల్లో అమాయక ప్రజలను అత్యంత దారుణంగా హత్య చేయడం జరిగిందని గుర్తు చేశారు. మతసామరస్యానికి ప్రతీక అయిన భారత్‌ను విడదీయడం ఎవరి తరం కాదని, ఈ విషయాన్ని ఉగ్రవాదులు గుర్తుంచుకోవాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్ వి రమణ హెచ్చరించారు. పహల్గమ్ సంఘటనకు పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఎపియుడబ్లూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మూల అల్లూరి రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పహల్గమ్ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయు మాజీ సభ్యులు జివిఎల్ నరసింహారావు, కేవీ సత్యనారాయణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి మోహన్ రెడ్డి ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె బాజీవలి, యూనియన్ జిల్లా కోశాధికారి డి బాబి, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ కె అన్ను, సుబ్రమణ్యం, యూనియన్ నాయకులు ఎస్‌కె మహబూబ్ భాష,ఆదినారాయణ, సయ్యద్ షాకీర్ హుస్సేన్, మల్లికార్జున, నరేంద్ర, వి రాజు, ఎస్‌కె మస్తాన్‌బాబు, ఎస్‌కె కరీం, ఎస్‌కె బషీర్, ఎస్‌కె రఫీ, అర్ చెన్నయ్య, అన్వర్ భాష, వై సుబ్బారావు, శేఖర్, మల్లికార్జునరెడ్డి, యోగి, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్ర దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలి



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 26)

ఉగ్ర దాడిలో మరణించిన పర్యాటకులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సంతాపం ప్రకటించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్ర దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించామని అన్నారు. మరణించిన కుటుంబాల సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మెట్టు కుటుంబ సభ్యులకు కొండ్రెడ్డి పరామర్శ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 26)

నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ప్రముఖ పారిశ్రామికవేత్త, విశ్రాంత లెక్చరర్ మెట్టు రాంప్రసాదరావు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. మెట్టు రాంప్రసాదరావు ఇటీవల కాలంచేసిన నేపథ్యంలో నెల్లూరు నగరంలోని పద్మావతి సెంటర్ సమీపంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు స్వర్ణ వెంకయ్య, ఎం శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.


## లాడ్జీల పై తనిఖీలు నిర్వహించిన ఎస్ఐ

(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 26)

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కంభం పట్టణంలోని లాడ్జీల పై కంభం ఎస్ఐ నరసింహారావు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాడ్జిలలోని రూములు, రికార్డులు పరిశీలించి ఎవరైనా కొత్తవారు, అనుమానస్పదంగా కనిపిస్తే ఎలాంటి వివరాలు ఇవ్వకుండా మీ వద్దకు వచ్చి రూములు అద్దెకు అడిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే లాడ్జిలలో సిట్టింగులు ఏర్పాటు చేసినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.







## పొగాకు గరిష్ట ధర కిలో రూ.280

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 26)

ఒకటో నెంబర్ వేలం కేంద్రానికి శనివారం చౌటపాలెం, రాజోలపాడు, కొత్తపాలెం గ్రామాలను నుంచి పొగాకు రైతులు వేలం కేంద్రానికి 1190 పొగాకు బెల్లు తీసుకొని రాగా 1073 బేళ్లు కొనుగోలు చేశారు. 60 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలకగా కనిష్ట ధర రూ.215 పలికింది. ఈ వేలం కేంద్రంలో మొత్తం 18 కంపెనీలు పాల్గొన్నాయి.



# సీతారామ మెమోరియ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
# మాతా శిశు వైద్యశాలలో గర్భిణీలకు బ్రేడ్స్, ఫ్రూట్స్ పంపిణీ









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలు గా మార్చుకొని చేసుకోవడం మంచి సంప్రదాయ అని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య శాఖ ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, సూర్య చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, కమ్మవారి సంఘం జిల్లా అధ్యక్షులు మండవ మురళీకృష్ణ పాల్గొన్నారు. పుట్టినరోజులను ఆర్భాటంగా చేసుకునే ఆనవాయితీ నుంచి సేవా కార్యక్రమాలు వైపు దృష్టిసారించడం అభినందనీయమని ఒంగోలు నగర మేయర్ గంగాడ అన్నారు. సీతారావమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు మాతా శిశు వైద్యశాలలో ప్రవాస భారతీయులు అమర్ చంద్ నాగ కిన్నెరల కుమార్తె తలశిల సౌమిక 11వ జన్మదినం సందర్భంగా గర్భిణీలకు బ్రేడ్, బిస్కెట్స్ పండ్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు,సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మండవ మురళీకృష్ణ లతో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగాడ సుజాత మాట్లాడుతూ గతంలో సీతారామమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, కరోనా సమయంలో కూడా వారి సేవలు ప్రజలకు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల ద్వారా తమ పుట్టినరోజులను జరుపుకుంటే ఇంకొకరికి మేలు చేసిన వారిమీ అవుతామని అయన పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాతా శిశు వైద్యశాలలో ఎక్కువ మంది పేద మహిళలు ఉంటారని అటువంటి వారికి ఇటువంటి సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ సేవలను పొందాలని అయనకోరారు. దాదాపు 5,6 సంవత్సరాలుగా సీతారావమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చేసే సేవా కార్యక్రమాల్లో తాము పాలుపంచు కున్నామని, నిస్వార్థంగా పదిమందికి సేవ చేయటం అనేది పూర్వజన్మ సుకృతమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు నూక తోటి శరత్ బాబు ,మాతా శిశు వైద్యశాల సూపరింటిండెంట్ సుబ్బారావు, మారెళ్ళ సుబ్బారావు, మండవ సుబ్బారావు, సినీ నటులు ధర్నాసి మస్తాన్ రావు, మాజీ కౌన్సిలర్ తన్నీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల ధరల పట్టికను స్కూల్స్ ముందు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలి

### జై జనం పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

జిల్లాలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లోని ఫీజుల ధరల పట్టికను పుస్తకాల ధరలు పట్టికను స్కూల్స్‌కు ముందు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ జై జనం పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిబాబు ప్రకాశం జిల్లా డీఈఓకి వినతిపత్రం అందజేశారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని ప్రతి ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్ ముందు ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన స్కూల్ పీజు ధరల పట్టికను ప్రైవేట్ స్కూల్స్ ముందు పెట్టే విధంగా, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం వారు తల్లిదండ్రుల దగ్గర ఎల్‌కేజీకి రూ.25 వేలు 7వ తరగతికి రూ.35వేలు,8వ తరగతికి 45వేలు, 9వ తరగతికి 50 వేలు, 10వ తరగతికి 60 వేల రూపాయలు మూడు విడతలుగా వసూలు. అంతేగాక బుక్స్ 3000 వేల రూపాయలు అయితే.. 6000 వేలు రూపాయిలు వసూలు చేస్తున్నారని, ఒక ప్రైవేట్ స్కూల్లో వెయ్యి మంది విద్యార్థులు ఉంటే50 లక్షల రూపాయలు అధిక వసూలు, యాజమాన్యానికి ఆదాయం వస్తుంది అని విద్యార్థులు తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక అల్లాడుతున్నారని.. ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రతి ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్ ముందర ధరల పట్టిక బోర్డులు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. ప్రకాశం జిల్లా జై జనం పార్టీ నాయకులు, పేముల యోహాను, కాకుమాను యేసు దాసు, సుదర్శి శ్రీను, అబ్రహం, కనమాల జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలు నిర్వహించిన ఎస్ఐ నరసింహారావు

### మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు







(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 26)

కంభంలో ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున పట్టణంలోని పలు చోట్ల ఎస్ఐ నరసింహారావు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. కంభం పట్టణం మీదుగా ప్రయాణించే పలు వాహనాలను తన సిబ్బంది తో కలిసి తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీలు నిర్వహించిన అనంతరం ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపటం నేరమని, నేరం రుజువు అయిన వారి పై కేసులు నమోదు చేస్తామని, అలాగే వాహన దారులు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పొదిలి నగర పంచాయతీ కమిషనర్‌ను కలిసిన టీడీపీ నాయకులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 26)

పొదిలి నగర పంచాయతీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ జిలాని భాష, తెలుగుదేశం పార్టీ నాయకులు సామి రాజా, గునుపూడి కృష్ణ, కారం శెట్టి కిషోర్, రావూరి ప్రసాద్, వరికుంట వెంకటేశ్వర్లు, ఖాదర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



## లక్షల విలువ చేసే నీటి సంపద నిర్వహణకు నిధులు, సిబ్బందిని కేటాయించాలి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 26)

లక్ష కోట్లు విలువ చేసే నీటి సంపద నిర్వహణకు నిధులును సిబ్బందిని కేటాయించాలని, లక్ష కోట్లు విలువచేసే ఇరిగేషన్ సిస్టం నిర్వహణకు నిధులను సిబ్బందిని కేటాయించాలని, తెలుగు గంగ ఎస్ ఈ రాధాకృష్ణారెడ్డికికి బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. సోమశిల కండలేరు డ్యాంలతో పాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 1720 చెరువులు, 2200 పంట కాలువలు చిన్న కాలువలు లక్ష కోట్లు విలువ చేస్తాయి. నెల్లూరు జిల్లా ఇరిగేషన్ రంగంలో మెయింటెనెన్స్‌కు నిధులు లేని కారణంగా నీటి వృధా ఎక్కువగా జరుగుతుంది. సోమశిల కండలేరు వరద కాలువ 5.5 కిలోమీటర్ల వద్దనున్న రెగ్యులేటర్ గేట్లు సకాలంలో దిగకపోవడంతో రోడ్డు కొట్టుకుపోవడం పంట పొలా ల్లోకి నీరు ప్రవహించడను గుర్తు చేశారు. కండలేరు లో లెవెల్ స్లూఇస్ గేటు దిగకపోవడంతో వాగు ద్వారా నీటి వృథా జరిగింది. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేశారు. సోమశిల కండలేరు డ్యాములులో నిర్వహణకు సాంకేతిక సిబ్బంది లేరు. ఉన్న జలవనరుల వినియోగానికి రక్షణకు నియామకాలు లేవు. నెల్లూరు బ్యారేజీ వద్ద సామాగ్రినీ తిక్కన మందిరం పక్కన ఉంచారు. కనీసం వాచ్మెన్ కూడా లేకపోవడంతో ఐరన్ మెటీరియల్ దొంగలు ఎత్తుకు పోతున్నారు. ఏడాది క్రితం సామాగ్రి దొంగలింప బడినప్పుడు ఏఈ శ్రీకాంత్ రికవరీ చేశారు. సాగునీటి కాలువలు రెగ్యులేటర్లు తూములు నిర్వహణకు జిల్లాలో సిబ్బంది లేరు. 2021లో సోమశిల డ్యామ్ ముందు భాగంలో దెబ్బతిన్న ఆప్రాన్‌కు నిధులు లేవని పనులు నిలిపేశారు. సోమశిలకు వరద వస్తే చేసిన పనులు కూడా దెబ్బతింటాయి. సోమశిల కండలేరు కాలువ వైడనింగ్ పనులు నిధులు లేవని ఆపేశారు. నెల్లూరు జిల్లా ఇరిగేషన్ రంగంలో పెండింగ్ పనులు రాష్ట్ర ప్రయారిటీ జాబితాలో లేనట్లు ఉన్నాయి. నీటి వృథాను అరికట్టేందుకు లక్ష కోట్లు విలువ చేసే డ్యాములు చెరువులు పంట కాలువలు కట్టడాలు నిర్వహణకు నిధులను సిబ్బందిని నియమించాలని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, నీలి శెట్టి లక్ష్మణరావు, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వైవాహిక జీవితానికి అర్ధనారీశ్వర తత్వం ఆదర్శం

### ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)



ఆధునిక వైవాహిక జీవితానికి పార్వతీ పరమేశ్వరుల అర్ధనారీశ్వర తత్వం ఆదర్శంగా నిలుస్తుందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. రెంటచింతల సీతామహాలక్ష్మి పేరుతో మార్కాపురంలోని మార్కండేయ స్వామి దేవస్థానంలో ఏర్పాటుచేసిన స్మారక ఉపన్యాసంలో పొన్నూరు వేంకట శ్రీనివాసులు "అర్ధనారీశ్వర తత్వం – ఆధునిక వైవాహిక జీవితం" అనే అంశంపై ప్రసంగించారు. సృష్టి ప్రారంభంలోనే పరమేశ్వరుడు పార్వతి దేవికి తన శరీరంలో అర్థం భాగాన్ని ఇచ్చి కలియుగంలో భార్యాభర్తల అనుబంధానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. కొత్తగా వివాహమైన నూతన దంపతులు అర్ధనారీశ్వర తత్వాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా నిండు నూరేళ్లు భార్యాభర్తలు రెండు శరీరాలు ఒక ఆత్మగా గడపవచ్చని అన్నారు. అటువంటి కుటుంబాల వల్ల కుటుంబ శ్రేయసే కాకుండా, సమాజ శ్రేయస్సు, ప్రపంచ శ్రేయస్సు కూడా ముడిపడి ఉంటాయని అన్నారు. శివుడు అంటే శాంతి స్వరూపుడని, శివ ఆరాధన వల్ల సకల ఐశ్వర్యాలు, సంపదలు కలగటమే కాకుండా మోక్షాన్ని కూడా ఇచ్చే మహాదేవుడు పరమేశ్వరుడని తెలిపారు. ఉపన్యాసం అనంతరం కార్యక్రమ నిర్వాహకులు రెంటచింతల అంబయ్య శాస్త్రి, సీనియర్ అడ్వకేట్ పురాణం సుబ్రహ్మణ్యం ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు కె వి రమణారెడ్డి, రఫీ, ఎంవి రమణ, తోట శ్రీనివాసరావు, ఐటిఐ కాలేజీ లెక్చరర్ డి మధుసూదనరావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



## క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

### మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి టి రాజ్యలక్ష్మి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

చిన్నతనం నుండే విలువలతో కూడిన విద్య క్రమశిక్షణ వలన జీవితంలో ఉన్నత శిఖరాల అధిరోహించవచ్చని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి టి రాజ్యలక్ష్మి అన్నారు. ఈ నెల 26వ తేదీ ఒంగోలు పట్టణంలోని బాల సదన్ సందర్శించిన న్యాయమూర్తి అక్కడ విద్యార్థులకు అందుతున్న వసతి సదుపాయాలు, భోజన సదుపాయాలను పరిశీలించారు. సంబంధిత దస్త్రాలు ,కార్యాలయ నిర్వహణ పరిశీలించారు.మరింత మెరుగైన సదుపాయాల కోసం, వసతుల కోసం మెరుగైన సూచనలు అందించారు. చట్టపరంగా విద్యార్థులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తుందని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి సిసి గృహాన్ని సందర్శించి అక్కడ నవజాత శిశువుల యొక్క యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ హేమలత, జూనియర్ సివిల్ న్యాయమూర్తి కే నికిత, పిల్లల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దినేష్, తదితరులు పాల్గొన్నారు.

## కిషోర్ వికాసం వేసవి శిబిరం శిక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 26)

శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు నిషేధం, బాలికల అక్రమ రవాణా, బాలికలపై అత్యాచారాలు నిర్మూలించుట మొదలగు కార్యక్రమాలపై ప్రతి పంచాయతీలో ఐసిడిఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు అవగాహన కార్యక్రమాలు చేయాలని, బాలికలకు విద్యా, ఆరోగ్యం, పరిశుభ్రత, పోషక విలువ గల ఆహారం తీసుకోవడంపై అంశాలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు.

## వై యస్ షర్మిలారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన

# మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల టిడిపి నాయకులు






**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 26)**
మార్కాపురం నియోజకవర్గ పరిధిలో మార్కాపూరం పట్టణం, తర్లుపాడు మండలనికి చెందిన తెలుగుదేశంపార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ హుస్సేన్ సారధ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త షేక్ సైదా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై యస్ షర్మిలరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా షర్మిల రెడ్డి మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పూర్వం వైభవం తధ్యం మని, 2029 నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు సాధ్యమే నని అందరూ కష్టపడి పనిచేయలని ఆమె కోరారు. కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయిన వారు వివరాలు ఉన్నాయి. మార్కాపురం నియోజకవర్గం తర్లుపాడు మండలం నుంచి షేక్ హుస్సేన్, షేక్ మహబూబ్ వలీ, షేక్ ఖాసిం పీరా, షేక్ రహీం, షేక్ అబ్దుల్, షేక్ ఖాసీం, షేక్ షంషేర్, (మార్కాపురం) నెలపాటి పవన్ (పీసీ పల్లి) బాబురావు, తదితరులు షర్మిలమ్మ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) పాలపర్తి విజేష్ రాజ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి బొడ్డు సతీష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పైనం మధు, తదితరులు పాల్గొన్నారు.

## బుడంగుంట్ల వేణుగోపాల్ అంత్యక్రియలకు మానవత సంస్థ సాయం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 26)**
పొదిలి నగర పంచాయితీ పరిధిలోని శ్రావణి ఎస్టేట్ నందు స్వర్గస్తులైన బుడంగుంట్ల వేణుగోపాల్ అంత్యక్రియలకు మానవత సంస్థలోని దాతల సహకారంతో అందించే 5000 రూపాయలను పొదిలి మానవత కమిటీ సభ్యులు పాల్గొని చెక్ రూపంలో అందించి వారి కుటుంబానికి ప్రఘడ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఛైర్మెన్ మువ్వల పార్ధసారధి, కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, కార్యదర్శి అశోక్ బండి, జి శ్రీనివాసులు, రెబ్బానీ, తదితరులు పాల్గొన్నారు.


## త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 26)**
త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపిడిఓ రంగ సుబ్బరాయుడు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రంగ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గృహ నిర్మాణ శాఖ కు సంబంధించిన రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ లబ్ధిదారులను మోటివేట్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ, మండలంలోని అందరూ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, వర్క్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

## అమాయక ప్రజలను హత్య చేయడం దారుణం

**139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు**



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 26)**
జమ్మూ కాశ్మీర్లో అన్యం పుణ్యం తెలియని అమాయక ప్రజలను ఉగ్రవాదులు అతి కిరాతకంగా హత్య చేయడం దారుణమని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం హత్యలకు పాల్పడిన ఉగ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరించాలని వారికి సహకరించిన దేశం ఏదైనా సరే తగిన విధంగా గుణపాఠం చెప్పాలని శ్రీనివాసులు తెలిపారు. ఉగ్రవాదులను పట్టుకుని బహిరంగంగా ప్రజల సమక్షంలో శిక్షించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు కంప్యూటర్ యుగంలో కూడా హిందువులు అనగానే హత్యలు చేయటం ఉగ్రవాదులకు తగదని అన్నారు. మనిషి అనేవాడు ఏ మతస్థుడైనా సరే ప్రాణం ఒకటే కదా అని శ్రీనివాసులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరించకపోతే రానున్న రోజుల్లో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతారని అలాంటి భయాన్ని పోగొట్టే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని శ్రీనివాసులు తెలిపారు.

## వెలుగు కార్యాలయంలో ఉచిత టైలరింగ్ శిక్షణ





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 26)**
స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ , ఈ డబ్ల్యూ ఎస్ వారి సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మండల టిడిపి నాయకుడు మండవ ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఈ పథకం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన అన్నారు అనంతరం ఎంపీడీవో డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం 70 రోజుల వరకు ట్రైనింగ్ ఉంటుందని ,ఈ శిక్షణకు మొత్తం 144 మంది శిక్షణకు అర్హులుగా ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్ పథకాన్ని అమలు చేసి ఉచితంగా కుట్టు మిషన్ పంపిణీ చేస్తారని, పేదింటి మహిళల స్వయం ఉపాధి కోసం ఉచిత కుట్టు మిషన్ పంపిణీతో పాటు టైలరింగ్ కూడా ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ ఇస్తుందని, కుట్టు నైపుణ్యంతో ఇంటి నుంచే ఆదాయం పొందవచ్చు అని,శిక్షణ తర్వాత కుట్టు మిషన్ ఇవ్వడం వల్ల వెంటనే పని మొదలు పెట్టుకోవచ్చని,కొంత అనుభవం తర్వాత టైలరింగ్ షాప్ ఓపెన్ చేసుకోవచ్చని,అదనపు ఆదాయంతో కుటుంబ ఖర్చులు సులభంగా భరించవచ్చు, నైపుణ్యం నేర్చుకోవడం వల్ల మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకుడు కర్ణ కోటిరెడ్డి, ఈఓఆర్డి నాగేశ్వరరావు, పంచాయతీ సెక్రెటరీ లో నారాయణ, రవణమ్మ, అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి, ఏపిఎం శ్రీనివాస్, శిక్షణ పొందుటకు వచ్చిన మహిళలు, ట్రైనర్ సంపూర్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం అందించడమే లక్ష్యం

**రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ**




**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 26)**
నెల్లూరు నగరంతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం నెల్లూరు నగరంలోని 9 వ డివిజన్ రాయపాలెంలో అభివృద్ధి చేసిన అంబేద్కర్ పార్క్‌ను పునః ప్రారంభించిన మంత్రి నారాయణ అనంతరం సంతపేటలోని చేపల మార్కెట్‌ను పరిశీలించి అక్కడి దుకాణాదారులతో వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం చేసే అభివృద్ధిని తర్వాత వచ్చే ప్రభుత్వాలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సొమ్ముతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో తిరిగి ఆయా అభివృద్ధి కార్యక్రమాలను వరుస క్రమంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రీన్ కార్పొరేషన్ ద్వారా నగరాలు, పట్టణాల్లో పార్కులు, సెంట్రల్ డివైడర్లు, కాలువలు, పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. నెల్లూరు నగర శాసనసభ్యునిగా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రకారం నగరంలోని 46 పార్కులలో, 54 పాఠశాలల్లో ప్లే, జిమ్ ఎక్విప్మెంట్ ను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ మైదానం ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇదే విధమైన అభివృద్ధిని రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కేంద్రాల్లో చేస్తామన్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా రెండు రూపాయలకే 20 లీటర్ల తాగునీటిని అందిస్తూ ప్రతి రోజు మూడు లక్షల లీటర్ల త్రాగునీటిని అందిస్తామన్నారు. నెల్లూరు నగర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. ప్రజల యొక్క జీవన ప్రమాణాలు మెరుగుపడి ఆర్థికంగా కుదురుకునేందుకు వారికి అవసరమైన షాపులు కేటాయించడం జరుగుతుందన్నారు. గతంలో లాటరీ ద్వారా సంతపేట లోని చేపల షాపులు కేటాయించామని, వాటిని నిశితంగా పరిశీలించామని, ఖాళీగా ఉన్నచోట ఇతరులకు కేటాయించడం జరుగుతుందన్నారు. అలాగే దుకాణదారుల కోరిక మేరకు ప్రత్యేక కరెంటు మీటర్లను అందజేస్తామన్నారు.

**అమరావతి భూముల విలువ పెరిగేలా అభివృద్ధి చేస్తాం**

రాష్ట్ర రాజధాని అమరావతిలో భూముల విలువ పెరగడానికి మరింత అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. కాలుష్యం లేని పరిశ్రమల స్థాపన ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. పారిశ్రామికవేత్తలు రాకపోకలకు అనువుగా ఉంటేనే ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తారన్నారు. అందుకుగాను అమరావతిలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి దూర దృష్టితో ప్రయత్నిస్తున్నారన్నారు. అలాగే అమరావతి లో స్మార్ట్ సిటీ, స్పోర్ట్స్ సిటీ లను సైతం నిర్మిస్తామన్నారు. ఇందుకు అవసరమైన భూమిని సేకరించేందుకు రైతులతో చర్చించి, వారికి న్యాయం జరిగి నష్టపోకుండా ఉండే విధమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నందన్, మున్సిపల్ మాజీ చైర్మన్ అనురాధ స్థానిక నాయకులు విజయభాస్కర్ రెడ్డి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు

# ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)**
ఈ వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలను, పక్షుల కోసం ఏర్పాటుచేసిన నీళ్ల ఉట్టిలను శనివారం నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో నీటి తొట్టెలు, ఉట్టిలను ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వము, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా మూగజీవాల దాహాన్ని కూడా తీర్చాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ దిశగా స్వచ్ఛంద సంస్థలు కూడా మరింతగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో పాటు స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సూచనల మేరకు నగరంలో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ తొట్టెలు, ఉట్టిలలో నీళ్లు తగ్గితే గమనించిన వెంటనే స్థానిక ప్రజలు కూడా వీటిని నింపే ప్రయత్నం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పశు సంరక్షణ సంస్థలు అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా అతిథులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అశోక్ బాబు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ప్రముఖ వ్యాపారవేత్త మండవ మురళీకృష్ణ, సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధులు దివ్య, శ్రీదేవి, పీపుల్ ఫర్ యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధి సికిందర్, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, ఇతర అధికారులు, పలువురు ప్రజా పతినిధులు పాల్గొన్నారు.





# గిన్నిస్ బుక్‌లో జాషువా దార కుమార్‌కి చోటు




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 26)

మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ ఇన్చార్జిగా పనిచేస్తున్న దార కుమార్ (జాషువా) గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించారు. ప్రపంచ స్థాయిలో జరిగిన ప్రదర్శనలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ సంగీత కళాకారుల బృందం ఆధ్వర్యంలో కీబోర్డులో సరళి స్వరాలను 45 సెకండ్లలో స్వరపరిచి, గంటలో 1046 వీడియోలు గత ఏడాది డిసెంబర్ 1న అప్లోడ్ చేయడం ద్వారా ఈ ఘనత సాధించారు. కాగా, ఈ నెల 25న విజయవాడలో జరిగిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో పాస్టర్ దంగిడి అగస్టెన్ చేతుల మీదుగా మెడల్ గిన్నిస్ వరల్డ్ ధ్రువ పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పుర ప్రముఖులు క్రైస్తవ సంఘాలు, చర్చి సభ్యులు, మిత్రులు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

## ఎంపీడీవో డాక్టర్ సుజాతకు వినతి పత్రం అందజేసిన 108 సిబ్బంది




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 26)

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 108 సిబ్బంది ఎంపీడీవో డాక్టర్ సుజాతకు విశ్రాంతి భవనం కోసం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విశ్రాంతి భవనం కోసం స్థలాన్ని పరిశీలించి ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, మాజీ మండల టిడిపి అధ్యక్షుడు మండవ ప్రసాద్, పల్లపోతు వెంకట్రావు, మాదాల ప్రసాద్, నరసింహారావు, 108 సిబ్బంది కే వాసు బాబు, వి నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మైమరపించిన వీణా వాదనం

### భక్తులను తన్మయులను చేసిన మద్దులూరి లక్ష్మీ వసుంధర బృందం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం సాయంత్రం ఒంగోలుకు చెందిన లలితా గాయత్రి సంగీత నిలయం కళాకారులు మద్దులూరి లక్ష్మీ వసుంధర బృందం తమ వీణా వాదనం సంగీత ప్రదర్శనతో భక్తులను కళాభిమానులను తన్మయులను చేయడంతో పాటు మైమరపింప చేసారు. ముద్దుగారే



యశోద, చక్కటి తల్లికి చాంగు భళా, అదివో అల్లదివో వంటి తాళ్లపాక అన్నమాచార్యులు విరచిత సంకీర్తనలతో పాటు పాహి రామా ప్రభో వంటి పలు భక్తిరస సంకీర్తనలను వీణలపై సుతారంగా పలికించి వీణా వాదనంలో తమ ప్రజ్ఞను రుజువు చేసి కళాభిమానుల అభినందనలను అందుకున్నారు. చక్కటి వీణా వాదనం సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులను పలువురు అభినందించారు. వీణా వాదనం సంగీత కళాకారులు మద్దులూరి లక్ష్మీ వసుంధర, ఎన్ జీ ప్రవల్లిక, ఎం మానసిలను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి , ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీ వి రామకృష్ణారావు , ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారిలతో పాటు ఆలూరు జై శంకర్ అభినందించడంతో పాటు ఘనంగా సత్కరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సంగీతాభిమానులు హాజరయ్యారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేసారు.

# వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోనే నెంబర్ వన్ మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతాం

రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
6000 మంది విద్యార్థులతో ప్రతిష్టాత్మకంగా కొనసాగిన వీఆర్ హైస్కూల్
అంతటి ఘన చరిత్ర ఉన్న వీఆర్ హైస్కూల్‌ను మూసివేసిన గత ప్రభుత్వం
ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వీఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం
వీఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న ఆధునీకరణ
పనులను క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి
దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న విద్యార్థులకు వీఆర్ హైస్కూల్‌లో ప్రవేశం
నాణ్యమైన విద్యతో పాటు అన్నీ వసతులు ఉచితంగా అందజేత
మున్సిపల్ జూనియర్ కాలేజిలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన విద్యార్థినులకు కిట్లు పంపిణీ
అధికారులకు పలు విషయాల పై సూచనలు చేసిన రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 26)

నెల్లూరు వీఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌లో చేపట్టాల్సిన, చేపట్టిన పనులపై మంత్రి క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తాను ఇదే హైస్కూల్‌లో చదివిన అనుభూతిని హర్షం వ్యక్తం చేస్తూ తెలియజేశారు. అనంతరం మున్సిపల్ జూనియర్ కాలేజీలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందున్న విద్యార్థినులకు మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ గారు కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థినీలతో శిక్షణ పొందిన విధానాన్ని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ హైస్కూల్ నుంచి డిగ్రీ వరకూ తన విద్యాభ్యాసం వీఆర్సీ లోనే సాగిందని తెలిపారు. విద్యా విధానానికి ఆదర్శప్రాయంగా వీఆర్ విద్యాసంస్థలు కొనసాగాయన్నారు. అయితే 6000 విద్యార్థులు ఉన్న వీఆర్ హైస్కూల్‌ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కానీ తాను ఎన్నికల సమయంలో వీఆర్ హైస్కూల్ ని పునః ప్రారంభిస్తానని ఇచ్చిన హామీకి కట్టుబడి ఆ దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వైసీపీ హయాంలో మూసేవేసిన వీఆర్ హైస్కూల్ ను ఆధునీకరిస్తున్నామన్నారు. వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోనే నెంబర్ వన్ మోడల్ స్కూల్ గా తీర్చి దిద్దుతామని మాటిచ్చారు. దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న పేద పిల్లలకు మాత్రమే వీఆర్ హైస్కూల్‌లో అడ్మిషన్ కల్పిస్తామని చెప్పారు. ట్రాన్స్‌పోర్ట్ తో సహా విద్యకు సంబంధించి సకల సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థులకు ఉచిత భోజన వసతి కూడా ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ,విద్యాభివృద్ధికి సంపూర్ణ మద్దతు ఇచ్చారని మంత్రి నారాయణ తెలియజేశారు. మరో నెలరోజుల్లో అన్నీ వసతులతో వీఆర్ హైస్కూల్‌ను అందుబాటులోకి తెస్తామని మంత్రి చెప్పారు.

# 50 శాతం వడ్డీ తగ్గింపు గడువు ఈ నెల 30 వరకు పెంపు

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, పొదిలి 26)

50% వడ్డీ తగ్గింపు గడువు తేది ఈ నెల 30వ తేదీ వరకు పెంచినట్లు పొదిలి నగర పంచాయతీ కమిషనర్ కె ఎల్ నారాయణరెడ్డి తెలిపారు. ప్రభుత్వం వారి ఆదేశముల మేరకు ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించిన వారికి ఇప్పటి వరకు వున్న వడ్డీ నుండి 50% వడ్డీ మాఫీ చేసి ఉన్నారు. ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు పాత బకాయిలతో కలిపి 2025 - 26 ఆర్థిక సంవత్సరం వరకు ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించిన వారి ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నుల పై ఉన్న వడ్డీ నుండి 50 శాతం వడ్డీని తగ్గించబడుతుందన్నారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరమునకు గల ఇంటి పన్ను ఏక మొత్తం చెల్లించిన వారికి ఇంటి పన్ను పై ఐదు శాతం రాయితీ కలదన్నారు. పట్టణ ప్రజలు ఈ సువర్ణ అవకాశం సద్వినియోగం చేసుకుని మీ ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించి 50 % వడ్డీ మినహాయింపు, ఐదు శాతం పన్ను తగ్గింపు పొందాలన్నారు. ఈ అవకాశం ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందన్నారు. అలాగే పట్టణ ప్రజల సౌకర్యార్థం ఆదివారం, పండుగ సెలవు దినాలలో కూడా ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటి పన్నులు కట్టించుకోబడుతుందన్నారు.



# మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 26)

నెల్లూరు నగరం 39 వ డివిజన్‌లో వైసీపీ ఆధ్వర్యంలో వైస్సార్సీపీ విద్యార్థి విభాగం నేత తౌఫిక్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం పలువురు స్థానికులకు చంద్రశేఖర్‌రెడ్డి స్వయంగా మజ్జిగ అందజేశారు. చలివేంద్రం ఏర్పాటు ఆలోచన చేసిన తౌఫిక్ ను చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎక్కడికక్కడ వైసిపి నేతలు ముందుకొచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రజాసేవ చేయడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లప్పుడు ముందుంటారని తెలిపారు.

# ఉగ్రవాదుల దాడి అమానుషం ప్రకాశం జిల్లా కాపు సంఘం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

జమ్మూ కాశ్మీర్‌లో పహల్గామ్‌లో ఉగ్రవాదులు భారతీయులుపై చేసిన మారణకాండ దాడి అమానుషం, దుర్మార్గం, బాధాకరమని, ఈ దాడిని ప్రకాశం జిల్లా కాపు సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కాల్పుల్లో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, అమరులైన వారికి మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామన్నారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, వారి యొక్క కుటుంబ సభ్యులను కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.ఈ సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని,మరళ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నాము.ఈ దుర్ఘటనకు నిరసనగా ఒంగోలులోని రామ్ నగర్ 1వ లైన్ వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ ప్రదర్శన చేశారు. ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ మాట్లాడుతూ ఈ మారణకాండలో అసువులు బాసిన అమరవీరులకు ఆత్మకు శాంతి కలగాలని, నరమేధం సృష్టించిన ఉగ్రవాదులను అంతమొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షులు నరహరి సాంబయ్య, ఉమ్మిడిశెట్టి శ్రీనివాసరావు, కాపు ఏంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు నారపుశెట్టి రామ్మోహన్ రావు, చెన్నంశెట్టి శివ, వల్లంశెట్టి హనుమంతరావు, చింతపల్లి నారాయణ, మేకల నారాయణ, శనగల కిరణ్, శెట్టి సుబ్రమణ్యం, అడుసుమిల్లి వీరబ్రహ్మం, కె శ్రీనివాసరావు, కొలసాని సుధాకర్, రావెళ్ళ రాఘవ, కొల్లా సుఖదేవ్, రావెళ్ళ మురళి కృష్ణ, ఎ రాంబాబు, కాటా రాధాకృష్ణమూర్తి, మింగిశెట్టి కోటి, ఎ జెతిన్ సాయి, ఎ హర్ష, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com